క్లుప్తంగా

హరీశ్ వ్యాఖ్యలు సరికాదు

నిజామాబాద్‌అర్బన్: రైతుబంధు డబ్బులు ఆపి ఉద్యోగులను ఏసీ గదుల్లో కూర్చొబెట్టి జీతాలు చెల్లించామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు మాట్లాడటంపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని ఉద్యోగులకు క్షమాపణ చెప్పాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగెళ్ల సురేష్ డిమాండ్ చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్న ఉద్యోగులను ఎమ్మెల్యే హరీశ్‌రావు అవమానించారని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ధర్మేందర్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌లు విమర్శించారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించడంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అలాంటి ఉద్యోగులు, ఉపాధ్యాయులను ఎమ్మెల్యే హరీష్‌రావు విమర్శించడం సమంజసంగా లేదన్నారు. ఇలాంటి మాటలను వెంటనే వెనక్కి తీసుకోవాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు జమీలుల్లా, ప్రధాన కార్యదర్శి రమణాచారిలు డిమాండ్ చేశారు.

అలరించిన నృత్యాలు



నవీపేట: మండలంలోని నాగేపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం రాత్రి నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవం అలరించింది. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, నాటికాలు ఆకట్టుకున్నాయి. జిల్లా సాంస్కృతిక కోఆర్డినేటర్ అష్ట గంగాధర్ ఆలపించిన పాటలు అలరింపజేశాయి. కార్యక్రమంలో ఎంఈవో గణేశ్‌రావు, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ స్వరూప, ఎస్‌ఎంసీ చైర్మన్ గంగారాం, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం



నవీపేట: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందమ్మల కల్యాణాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్రను పఠనం చేశారు.

హామీల అమలుకు కట్టుబడి ఉన్నాం



పెర్కిట్(ఆర్మూర్): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉందని ఆర్మూర్ మండలం ఫత్తేపూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గంగాసారం సునీల్‌రెడ్డి అన్నారు. ఫత్తేపూర్‌లో విద్యుత్ వినియోగదారులకు 'గృహజ్యోతి' జీరో బిల్లులను కాంగ్రెస్ నాయకులు ట్రాన్స్‌కో సిబ్బందితో కలిసి అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తారన్నారు. నాయకులు టీ పోచన్న, బీ ప్రవీణ్, ట్రాన్స్‌కో లైన్‌మన్ యూసూఫ్ తదితరులు ఉన్నారు.

కుటుంబాల తగాదాను రాజకీయం చేయొద్దు



మోర్తాడ్: ఏర్గట్లలో రెండు కుటుంబాల మధ్య ఉన్న తగాదాను బీఆర్‌ఎస్ నాయకులు రాజకీయం చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఏర్గట్ల మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు దేవారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆడెపు గంగాప్రసాద్, నాయకుడు జీవన్‌రెడ్డి మాట్లాడారు. జైనొద్దీన్ అనే బీఆర్‌ఎస్ నాయకునిపై దాడి జరిగిన విషయంలో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. జైనొద్దీన్, మునీరొద్దీన్ కుటుంబాల మధ్య మాత్రమే గొడవ జరిగిందని అన్నారు. అధికారం కోల్పోవడంతో బీఆర్‌ఎస్ నాయకులకు మింగుడుపడటం లేదని ఆరోపించారు. ఇకనైనా బీఆర్‌ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకోవాలని పేర్కొన్నారు.

శంభో.. శివ శంభో

- ఘనంగా మహా శివరాత్రి వేడుకలు
- శివనామస్మరణతో మారుమోగిన ఆలయాలు
- పోటెత్తిన భక్తులు



లొంకలో పూజలు చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి



నగరంలోని శంభుని గుడి వద్ద క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు



కలిగోట్ పుట్ట శివాలయం వద్ద ..



లొంకలో క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులు

సాక్షి నెట్‌వర్క్ : శంభో..శివ శంభో.. ఓం నమఃశివాయ..హర హర మహదేవా..శంభో శంకరా అంటూ శివనామస్మరణతో అర్బన్, రూరల్ నియోజకవర్గాల పరిధిలోని శివాలయాలు మారుమోగాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచే శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రముఖ శైవక్షేత్రాలలో శివుడి దర్శనానికి దాదాపు రెండు నుంచి 3 గంటల సమయం పట్టింది. నగరంలోని నీలకంఠేశ్వర ఆలయం, శంభునిగుడి, ఉమా మహేశ్వర ఆలయం(శ్రద్ధానంద్ గంజ్), లింగేశ్వర గుట్ట (మల్లారం), నందిగుట్ట(నాగారం), అమరేశ్వర ఆలయం (వినాయక్‌నగర్), నగరేశ్వర శివాలయం(తాణాగల్లి), భక్త మార్కండేయ మందిరం(కోటగల్లి), మనోకామేశ్వర శివాలయాలు(దేవిటాకీస్ చౌరస్తా), అలాగే సిరికొండలోని లొంక ఆలయం, డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి, సిరికొండ పరిధిలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిపోయాయి. మహాశివరాత్రి సందర్భంగా శివుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రికి శివపార్వతుల కల్యాణ వేడుకలను అంగరంగ వైభవంగా జరిపించారు. పండుగ సందర్భంగా చాలా ఆలయాల వద్ద జాతరలు వెలిశాయి. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయాల వద్ద క్యూలైన్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా భక్తులు ఉపవాస దీక్షలతో పండ్లు, ఫలాలు స్వీకరించారు. శుక్రవారం ఉపవాసం ఉన్న వారికి శనివారం ఆలయాల వద్ద అన్నదానం చేస్తున్నట్లు పలు ఆలయాల నిర్వాహకులు ముందస్తుగా తెలియజేశారు. అలాగే కొన్ని భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. నిజామాబాద్ నగరంలోని దాదాపు అన్ని శివాలయాలను దర్శించుకుని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపవాస దీక్షలతో, జాగారాలతో సృష్టిలయకారునిగా శివున్ని భక్తి ప్రపత్తులతో కొలుచుకునే పండుగ శివరాత్రి అని అన్నారు.



మల్లారం లింగేశ్వర గుట్టపై కోలాటాలు వేస్తూ..



నగర శివారులోని నందిగుట్ట వద్ద శివలింగానికి అభిషేకాలు చేస్తున్న భక్తులు



పూజలు నిర్వహిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



డిచ్‌పల్లి శ్రీకాశీ విశ్వనాథ ఆలయంలో ..



సుద్దపల్లి శ్రీరాజరాజేశ్వర ఆలయంలో హోమం



నీల కంఠేశ్వరాలయంలో పూజలో పాల్గొన్న భక్తులు



నందీశ్వరుడికి మొక్కుతూ..



తాళ్లరామడుగు రామాలయంలో శివపార్వతుల కల్యాణం



జక్రాన్‌పల్లి శివాలయంలో..



మల్లారంలోని లింగేశ్వర గుట్టపై మంత్రోచ్ఛరణలు చేస్తున్న చిన్నారులు





నాందేవ్‌వాడ బ్రహ్మకుమారీ విద్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న బ్రహ్మకుమారీ భక్తులు.. లొంకలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న భక్తులు

'లొంక' అభివృద్ధికి కృషి చేస్తా



శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే



లొంక ఉప ఆలయంలో సీసీ పనులు ప్రారంభిస్తూ..

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సిరికొండ: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన పురాతన శైవ క్షేత్రమైన లొంక రామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని లొంక గర్భగుడిలో ఇసుక లింగానికి ఆయన అభిషేకాలు, పూజలు చేశారు. శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్నారు. పురోహితులు ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలు అందచేసి ఆశీర్వదించారు. లొంక ఉప ఆలయంలో పూజలు చేసి సీసీ పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లొంక ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. త్రిదళ రాజగోపురం నిర్మాణం కోసం ఆలయ కమిటీ సభ్యులతో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. లొంకలో వరకు త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా పనులకు నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, నాయకులు వెల్మ భాస్కర్‌రెడ్డి, మునిపల్లి సాయారెడ్డి, గడీల రాములు, ముప్ప గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



జక్రాన్‌పల్లిలో ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ నర్సారెడ్డి



గోప్యతండాలో .. కాంగ్రెస్ నేతలు

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలో సీసీ రోడ్డు పనులను మాజీ సర్పంచ్ కాటిపల్లి నర్సారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సహకారంతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మునిపల్లి మాజీ సర్పంచ్ సాయరెడ్డి, కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు వినోద్, జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు జైడి మల్లేష్, అక్బర్‌ఖాన్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

గోప్యతండాలో..

సిరికొండ: గోప్య తండాలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ప్రారంభించారు. పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సంతోష్‌నాయక్, మాజీ ఎంపీటీసీ రాంసింగ్, బలరాం, శ్రీధర్, జగన్, బుచ్చన్న, గౌస్, ఫారూఖ్, జీవన్, దేశ్య, శివరాం తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులను ప్రతిఘటించాలి



మాట్లాడుతున్న అధ్యక్షురాలు రమ

సిరికొండ: దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులను ప్రతిఘటించాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) ఆర్మూర్ డివిజన్ అధ్యక్షురాలు పిట్ల రమ అన్నారు. రావుట్ల గ్రామంలో సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమ మాట్లాడుతూ.. మహిళలపై అన్ని రకాల హింసలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు రమేష్, దామోదర్, మానస, జమున, స్వరూప, మౌనిక, మాధురి, కవిత తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ, పురుష సమానత్వం కోసం పోరాడుదాం

తెయూ(డిచ్‌పల్లి): మహిళలు కుటుంబ పోషణ కోసం ఇంటితో పాటు బయట ఎంతో కష్టపడుతున్నారని తెలంగాణ యూనివర్సిటీ పీడీఎస్‌యూ కార్యదర్శి జయంతి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వర్సిటీ గర్ల్స్ హాస్టల్‌లో వంట చేసే మహిళలను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జయంతి మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్న సుప్రీం కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పని చేసే చోట ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలన్నారు. అవుట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. నేతలు నవ్య, అనూష, బిందు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	65,200	వెండి (కిలో)	75,900
22 క్యారెట్స్	60,125	- నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	200
	(కిలోకు)	లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	16	గాజరుగడ్డ	45	60
బెండకాయ	50	70	పచ్చిమిర్చి	40	70
బీరకాయ	40	60	దోసకాయ	25	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	30	60	గోబిగడ్డ	30	50
కాకరకాయ	50	70	గోబిపువ్వు	50	70
వంకాయ	40	60	బీట్‌రూట్	20	40
పాలకూర	20	40	కరివేపాకు	50	70
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	50	70
పుదీనా	35	60	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	50	80			

- సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	భీమా (తెలుగు) - 10.50, 1.40, 4.30, 7.30, 10.30
స్క్రీన్-2	ప్రేమలు (తెలుగు) - 1.30, 7.30 రికార్డ్‌బ్రేక్ (తెలుగు) - 4.30 ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు) 10.30
స్క్రీన్-3	గామి (తెలుగు) - 10.30, 1.30, 4.30, 7.30, 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	సైతాన్ (తెలుగు) - 10.20, 1.20, 4.20, 7.20, 10.20
స్క్రీన్-2	గామి (తెలుగు) - 10.00, 1.10, 7.35, 10.45 ప్రేమలు (తెలుగు) - 4.20
స్క్రీన్-3	భీమా (తెలుగు) - 12.20, 6.55 డ్యూన్-2 (ఇంగ్లీష్) - 3.25 ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు) - 10.00
స్క్రీన్-4	బాబు (తెలుగు) - 1.30 రికార్డ్ బ్రేక్ (తెలుగు) - 4.15 ప్రేమలు (తెలుగు) - 10.15
దేవి	ప్రేమలు (తెలుగు)
నటరాజ్	సైతాన్ (హిందీ)
లలితామహల్	భీమా (తెలుగు)
విజయ్	గామి (తెలుగు)

చదువుతో ఏదైనా సాధించొచ్చు

- ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

రెంజల్(బోధన్): చదువుతో ఏదైనా సాధించవచ్చని, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తోందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. పాఠశాలల్లో సమస్యలుంటే తన దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. రెంజల్‌లో రూ. 22 కోట్లతో నిర్మించిన మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను కలెక్టర్ రాజీవ్‌గాంధీతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బాలికల సంతోషం కోసం గురుకులాలను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలకు తన నిధుల నుంచి 25 కంప్యూటర్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

నాసిరకంగా పనులు చేపడితే చర్యలు

పాఠశాలను పరిశీలించిన ఎమ్మెల్యే నాసిరకంగా పనులు చేపడితే అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పనులు సక్రమంగా పూర్తి చేయించాలని ఆదేశించారు. అంతకు ముందు రెంజల్ తహసీల్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

భీమ్‌గల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వేసవికాల శిబిరం శుక్రవారం ముగిసింది. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ సతీశ్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సుదర్శన్ హాజరై మాట్లాడారు. సమాజంలో క్రమశిక్షణతో నడుచుకోవాలని, మంచి చేసే స్వభావాన్ని కలిగి ఉండాలని సూచించారు. చదువు, క్రమశిక్షణ ఈ రెండు ఉంటేనే సమాజంలో మంచి గౌరవం ఉంటుందని అన్నారు. కళాశాలను అభివృద్ధి చేసేందుకు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల బ్యాచ్ లీడర్లు, ఉత్తమ వలంటీర్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ అర్చన, హెచ్‌ఎం కళావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

టార్గెట్ చేరుకోవాల్సిందే

- మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే రూ.31 కోట్ల ఆస్తి పన్ను వసూలు
- మరో రూ.7 కోట్లు వసూలైతేనే రూ.15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల
- కొనసాగుతున్న ఆస్తి పన్ను వసూళ్ల డ్రైవ్



ఆస్తిపన్ను వసూళ్లలో నిమగ్నమైన అధికారులు, సిబ్బంది

నిజామాబాద్‌నాగారం: మున్సిపాలిటీకి ముందు నొయ్యి.. వెనుక గొయ్యి అన్నట్లు ఉంది. 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరైనా విడుదల కావాలంటే ఆస్తి పన్నులు వసూలు చేయాల్సిందే. గత ఏడాది రూ.33 కోట్లు వసూలు చేయగా.. దీనికి 12 శాతం అంటే రూ.5 కోట్లు కలుపుకొని మొత్తంగా రూ.38 కోట్లు వసూళ్లు చేయాల్సిందే. అప్పుడే 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలవుతాయి. లేకుంటే వచ్చి నిధులు వెనక్కు వెళ్తాయి. నిజామాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 60 డివిజన్లు, సుమారు 84వేల నివాసాలు, 4 లక్షల జనాభా ఉంది. ఇప్పటి వరకు రూ.31 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేశారు. నెల రోజుల నుంచి ఆస్తి పన్ను వసూళ్ల కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. 49 రెవెన్యూ సిబ్బంది నిత్యం ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పన్నులు వసూలు చేయడానికి తిరుగుతున్నారు.అయితే 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.3 కోట్ల వరకు వచ్చాయి. ఈ నిధులు విడుదల కావాలంటే కచ్చితంగా ఆస్తి పన్ను గత ఏడాది కంటే 12 శాతం అదనంగా వసూలు చేయాలి. ఇప్పటి వరకు రూ. 31 కోట్లు వసూళ్లు అయ్యాయి. మరో రూ.7 కోట్లు ఈ నెల 31లోపు వసూలు చేయాల్సి ఉంది.

ప్రత్యేక కార్యాచరణతో ముందుకు..

మున్సిపల్ అధికారులు ఆస్తి పన్ను వసూళ్లకు ఇప్పటికే ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. తాజాగా 35 వేల మందికి ఎస్‌ఎంఎస్ ద్వారా ఆస్తి పన్నులు చెల్లించాలని ఫోన్‌లో సమాచారం అందించారు. ఇంకా 23 రోజులు మాత్రమే సమయం ఉంది. దీంతో పాటు ఆస్తి పన్ను బకాయిలు, వడ్డీలపై 90 శాతం వెసులుబాటు కూడా కల్పించారు.

లక్ష్యాన్ని చేరుకుంటాం

ఆస్తి పన్ను విషయంలో ఇచ్చిన లక్ష్యాలను కచ్చితంగా చేరుకుంటాం. స్పెషల్ టీం డ్రైవ్‌లు సైతం కొనసాగుతున్నాయి. మరో రూ.7 కోట్లు వసూలు చేస్తాం. 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలకు చర్యలు తీసుకుంటాం.
– రాజేంద్రకుమార్, డిప్యూటీ కమిషనర్